
సాక్షి
అనంతపురం
ఆదివారం । 22 । జనవరి । 2023



**చీనీ టన్ను రూ.28 వేలు**

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీ కాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



**టమాట కిలో రూ.16**

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట ధరలు గరిష్టంగా రూ.16, కనిష్టంగా రూ.6, సరాసరి రూ.10 పలికాయి.

గరిష్టం/కనిష్టం 31.7°/ 13.6°

జిల్లా అంతటా శనివారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి.



## న్యూస్‌రీల్

### ఉగాదికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

రాప్తాడు రూరల్: 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పథకం కింద కేటాయించిన ఇళ్ల నిర్మాణాల లక్ష్యాన్ని ఉగాది నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. శనివారం అనంతపురం మండలం ఆలమూరు హౌసింగ్ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆలమూరు లేఅవుట్‌లో 5,900 ఇళ్లు మంజూరు కాగా, ఉగాది నాటికి 2 వేల ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించినట్లు తెలిపారు. ఆదివారం నుంచి మాఘమాసం మొదలవుతున్న నేపథ్యంలో ఇళ్ల నిర్మాణాలు మరింత వేగవంతమయ్యేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. బేస్మెంట్, ఆర్‌ఎఫ్, రూఫ్ కాస్ట్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. కలెక్టర్ వెంట హౌసింగ్ పీడీ కేశవనాయుడు, ఆర్డీఓ మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ భాగ్యలక్ష్మి, హౌసింగ్ డీఈ కృష్ణారావు, తహసీల్దార్ శ్రీధరమూర్తి, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

### 'ఖేలో ఇండియా'కు పేర్లు నమోదు చేసుకోండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఖేలో ఇండియా కార్యక్రమానికి సంబంధించి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు తప్పకుండా తమ పాఠశాలల పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రవికుమార్ సూచించారు. జిల్లా ఇన్‌చార్జ్ డీఈఓ కృష్ణయ్య ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను ఈ నెల 25 లోపు పూర్తి చేయాలని కోరారు. త్వరలో జిల్లాలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా కోఆర్డినేటర్లు 94902 00056, 94408 69884 నంబర్లలో సంప్రదించాలన్నారు.

### పీఎం కేర్స్ సహాయనిధి దరఖాస్తుకు అవకాశం

అనంతపురం సెంట్రల్: కోవిడ్ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన 18 సంవత్సరాల లోపు పిల్లల సంక్షేమం కోసం పీఎం కేర్స్ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షల ఆర్థికసాయం అందించింది. కొన్ని కారణాల రీత్యా ఇంకా మిగిలిపోయిన బాధిత కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. సచివాలయం, ఐసీడీఎస్ కార్యాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తెలిపారు.

### అందుబాటులో ఉండి సేవలందించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి

ఆత్మకూరు: ప్రభుత్వాస్పత్రి వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు సేవలందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అన్ని జాతీయ కార్యక్రమాల అమలుతో పాటు రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. మాతాశిశు మరణాలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. మాతాశిశు సంరక్షణపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. అసంక్రమిత వ్యాధుల సర్వే వివరాల అప్‌లోడ్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు.

# మిల్లర్‌తో మిలాఖత్!

- అనంతపురం నుంచి కర్ణాటకకు చౌకబియ్యం అక్రమ రవాణా
- ఖాకీలు, కొందరు నకిలీ విలేకర్ల సహకారం..
- నెలనెలా 71 మందికి మిల్లర్ ద్వారా మామూళ్లు
- హైవే అనుబంధంగా ఉన్న ప్రతి పోలీసు స్టేషన్‌కూ వాటాలు
- విజిలెన్స్ తనిఖీల్లో అక్రమ దందా బట్టబయలు

ఓ మిల్లర్...కొందరు ఖాకీలు..మరి కొందరు మైకు వీరులు... పాత్రికేయుల ముసుగులో ఇంకొందరు..ఇలా అందరూ ఏకమై పేదల బియ్యాన్ని సరిహద్దులు దాటిస్తున్నారు. టీడీపీ హయాం నుంచీ సాగిస్తున్న ఈ దందాకు విజిలెన్స్ అధికారులు కళ్లెం వేశారు. వివరాలు ఆరా తీయగా అనంతపురానికి చెందిన ఓ మిల్లర్ 71 మందికి ప్రతి నెలా మామూళ్లు ఇస్తున్నట్లు తెలిసింది. అలాగే ఈ బియ్యం దందాకు అనంతపురం నుంచి కర్ణాటక సరిహద్దు వరకూ ఎక్కడా అడ్డుకోకుండా జాతీయ రహదారిపై ఉన్న పోలీసు స్టేషన్లకూ రూ.25 వేల చొప్పున ప్రతి నెలా మామూళ్లు అందుతున్నట్లు సమాచారం.



విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన బియ్యం (ఫైల్)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: చౌకదుకాణాల ద్వారా పేదలకు అందించే రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. ఈ బియ్యం దందాలో మిల్లర్లు ఆరితేరిపోయారు. టీడీపీ అధికారంలో ఉన్నన్నాళ్లూ అనంతపురానికి చెందిన మంత్రి అండదండలతో రేషన్ బియ్యాన్ని అక్రమంగా రాష్ట్ర సరిహద్దులు దాటించి సొమ్ము చేసుకున్నారు. ప్రభుత్వం మారాక వారి పాచిక పారలేదు. దీంతో రవాణా అడ్డుకునే ఖాకీలను, వారికి ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఉండేందుకు మీడియా ముసుగులో దందాలు చేసే కేటుగాళ్లను మేనేజ్ చేస్తున్నారు. బియ్యాన్ని సరిహద్దు దాటించి రూ.కోట్లు దండుకుంటున్నారు.

**పాలిష్ చేసి సోనా మసూరిగా విక్రయం**

మిల్లర్లు మధ్యవర్తుల ద్వారా రేషన్ బియ్యం గ్రామాల నుంచి సేకరిస్తారు. దాన్ని మిల్లుకు తరలించి పాలిష్ చేసి మార్కెట్‌కు పంపుతున్నారు. కిలో రూ.10కు కొనుగోలు చేసి రూ.40 పైనే అమ్ముతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా అనంతపురంలోని పంగల్ రోడ్డులోని మిల్లులోనే ఈదందా జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. అందువల్లే సదరు మిల్లు యజమాని వ్యవస్థలను మేనేజ్ చేసేందుకు భారీగా ముట్టజెపుతున్నట్లు తెలుస్తోంది.

**మామూళ్ల ఎర వేసి..**

కర్ణాటకకు రేషన్ బియ్యం తరలిస్తున్న పంగల్ రోడ్డులోని మిల్లు యజమాని గతంలో టీడీపీ నేతల సాయంతో దందా సాగించేవాడు. ప్రభుత్వం మారడం.. అధికార పార్టీ నేతలు సహకరించకపోవడంతో రూటు మార్చాడు. తనకు అనుకూలమైన మీడియా, పోలీసుల సహకారంతో అడ్డగోలుగా సరుకును అక్రమ మార్గాల్లో జిల్లా దాటిస్తున్నాడు. ఇందుకోసం ప్రతి నెలా 71 మందికిపైగా పోలీసులు, మీడియా పేరు చెప్పుకుని తిరిగే వారికి 'మామూళ్లు' పంపుతున్నాడు. ఎంతగా అంటే ఒక్కో సీఐ, ఎస్‌ఐ స్థాయి అధికారులకు నెలవారీ ఫైనాన్స్, ఈఎంఐలకు సరిపడేంత మొత్తం. ఒక్క అనంతపురం జిల్లా కేంద్రంలోనే బియ్యాన్ని అక్రమంగా కర్ణాటకకు తరలించే ముఠా సభ్యులు నెలకు రూ.5 లక్షలు మామూళ్ల రూపంలో ముట్టజెబుతున్నారు. నగరంలోని పలు స్టేషన్లకు రూ.3 లక్షలు పోతే...మిగిలిన రూ.2 లక్షలు పాత్రికేయులుగా చెలామణి అవుతున్న వారి ఫోన్‌పేలకు వెళ్తోంది. తాజాగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులతో ఆ బియ్యం అక్రమ రవాణా దందా బయటపడింది.

**ఏడాదికి రూ.3 కోట్లకుపైనే సరుకు రవాణా**

అధికారుల గణాంకాల ప్రకారం ఏడాదికి రూ.3 కోట్లకుపైగా విలువైన రేషన్ బియ్యం అనంతపురం నుంచి కర్ణాటకకు తరలిపోతున్నట్లు తెలుస్తోంది. 2022 మార్చి నుంచి నేటి దాకా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జరిపిన మెరుపు దాడుల్లో 68 కేసులు నమోదు చేశారు. 79 వాహనాలను సీజ్ చేశారు. రూ.3.29 కోట్లు విలువ చేసే 873 టన్నుల బియ్యాన్ని సీజ్ చేశారు. ఇంకా అధికారుల కళ్లు గప్పి రాష్ట్రం దాటిపోయిన బియ్యం లెక్కలు సరేసరి.

**విజిలెన్స్ దాడులతో దందాకు ముకుతాడు**

టీడీపీ నేతల పుణ్యమా అని ఇప్పటి దాకా తమ వ్యాపారం బాగా సాగిందని పంగల్ రోడ్డు సమీపంలోని ఓ రైస్ మిల్లు యజమాని బహిరంగంగా చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఏ పొలిటికల్ లీడరూ తమకు సహకరించలేదంటున్నాడు. కేవలం మీడియా, పోలీసుశాఖ పుణ్యమా అని నెలకు నాలుగు లోడ్ల సరుకు సరఫరా చేస్తున్నానని చెప్పడం గమనార్హం. తాజాగా విజిలెన్స్ దాడులతో తమ ఆదాయానికి గండి పడటంతో పాటు కేసులు కూడా నమోదవుతున్నాయని ఆయన తెగబాధపడిపోతున్నాడు.

**అక్రమ రవాణాను అడ్డుకుంటాం**



రేషన్ బియ్యం పక్కదారి పట్టించి సొమ్ము చేసుకోవాలని చూసే వారు ఎంతటి వారైనా వదిలేది లేదు. కొందరు ఏళ్లుగా పేదల బియ్యాన్ని అక్రమంగా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇకపై అలాంటి వారి ఆగడాలకు కళ్లెం వేస్తాం. ఈ ముఠాలతో సంబంధాలున్న వారిపై కూడా దర్యాప్తు చేస్తున్నాం. అక్రమ రవాణా గురించి తెలిసిన వారు 95027 99399 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వొచ్చు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– వీరరాఘవరెడ్డి, డీఎస్పీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్

### జగనన్న బడుగు వికాసం నిధుల కేటాయింపు

అనంతపురం టౌన్: జగనన్న బడుగు వికాసం పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు నిధుల కేటాయింపులు చేసినట్లు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన శనివారం తన కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల పరిశ్రమల స్థాపనతోపాటు సేవా రంగం, ట్రాన్స్‌పోర్టు రంగం పరిశ్రమల కోసం ఎస్సీ, ఎస్టీల నుంచి 200 దరఖాస్తులు అందాయన్నారు. ఇందులో 93 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. వీరిలో 65 మంది ఎస్సీలకు రూ.4.26 కోట్లు, 28 మంది ఎస్టీలకు రూ.1.94 కోట్లు చొప్పున మొత్తం రూ.6.20 కోట్ల నిధులను కేటాయించి నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. వీరందరికీ త్వరలోనే రుణాలు మంజూరు చేస్తామన్నారు. జగనన్న బడుగు వికాసం పథకానికి ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలతో పాటు ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు జగనన్న బడుగు వికాసం పథకంలో భాగంగా 40 నుంచి 45శాతం మేర సబ్సిడీలు అందిస్తున్నట్లు చెప్పారు. జగనన్న బడుగు వికాసం పథకం కింద ఫిబ్రవరి నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకునే వారికి అర్హత ఉంటే అదే ఏడాది మంజూరు పత్రాలను సైతం అందజేయనున్నట్లు తెలిపారు.

### మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఖాళీగా ఉన్న రెండు ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 23 నుంచి 27వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు జిల్లా కార్యాలయంలో అందించాలని సూచించారు. దరఖాస్తు, పూర్తి వివరాల కోసం https://ananthapuramu.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

### 11న మెగా లోక్ అదాలత్

అనంతపురం సిటీ: అనంతపురంలో ఫిబ్రవరి 11న మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి గరికపాటి దీనబాబు శనివారం తెలిపారు. సివిల్, బ్యాంక్ బీమా, నగర పాలక సంస్థ ఆస్తి పన్ను బకాయి కేసుల్లో రాజీ కావాలనుకున్న వారు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# డబుల్ బ్యారెల్‌దే పైచేయి

- జిల్లాలో మొత్తం 542 లైసెన్సు తుపాకీలు
- ఇందులో బ్యాంకింగ్ సెక్యూరిటీలో పని చేస్తున్న వారి చేతిలోనే 490
- మాజీ సైనికోద్యోగులకు లైసెన్సు గన్ ఉంటేనే ఉద్యోగం
- ఇవి కాకుండా మరో 52 లైసెన్స్ పిస్టోళ్లు
- వ్యక్తిగత రక్షణ కోసం రాజకీయ నాయకుల వద్ద 35 పిస్టోళ్లు



**జిల్లాలో లైసెన్సు తుపాకీల వివరాలు**

| సబ్‌డివిజన్ | డబుల్ బ్యారెల్ | పిస్టోళ్లు |
|---|---|---|
| అనంతపురం | 156 | 20 |
| గుంతకల్లు | 78 | 05 |
| కళ్యాణదుర్గం | 65 | 06 |
| తాడిపత్రి | 191 | 21 |

సాక్షి ప్రతినిధి, అనంతపురం : డబుల్ బ్యారెల్ గన్.. ఈ పేరు వినని వారు ఉండరు. ఏ బ్యాంకులోకి వెళ్లినా సెక్యూరిటీ గార్డు చేతిలో ఇదే కనిపిస్తుంది. గన్ అంటే డబుల్ బ్యారెలే అనుకుంటారు. అనంతపురం జిల్లాలో లైసెన్సు ఉన్న తుపాకీల్లో డబుల్ బ్యారెల్ గన్‌లదే పైచేయి. జిల్లా పరిధిలో మొత్తం 542 తుపాకీ లైసెన్సులు ఉండగా.. అందులో 490 డబుల్ బ్యారెల్ గన్‌లే కావడం విశేషం. ఇవన్నీ బ్యాంకింగ్ సెక్టార్‌లో ఉద్యోగం చేస్తున్న సెక్యూరిటీ గార్డుల చేతుల్లోనే ఉన్నాయి. ఆర్మీలో ఉద్యోగ విరమణ చేయగానే వీళ్లు గన్ లైసెన్సును రెన్యూవల్ చేసుకుని బ్యాంకింగ్ సెక్టార్‌లో పనిచేస్తున్నారు.

**రాజకీయ నేతల వద్ద 35 పిస్టోళ్లు**

ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న ఈ ప్రాంతంలో చాలామంది వ్యక్తిగత రక్షణ కోసం పిస్టోల్‌ను వెంట పెట్టుకుంటారు. అలా లైసెన్సు పొంది పిస్టోళ్లను వాడుతున్న వారు 35 మంది రాజకీయ నాయకులు ఉన్నట్టు తేలింది. ఇక రిటైర్డ్ పోలీసు అధికారుల చేతుల్లోనూ మరో 7 పిస్టోళ్లు ఉన్నాయి. ఇక వ్యాపార నేపథ్యం లేదా ఆర్థిక కార్యకలాపాలు విస్తృత స్థాయిలో నిర్వహించే వారు కూడా కొంతమంది పిస్టోళ్లను కలిగి ఉన్నారు. అలాంటి పిస్టోళ్ల లైసెన్స్ కలిగిన వారు ఏడుగురు ఉన్నారు.

**కొత్తగా ఎవరికీ ఇవ్వడం లేదు**



ఏడాదిన్నర కాలంలో జిల్లాలో కొత్తగా పిస్టోళ్ల లైసెన్స్‌లు ఎవరికీ ఇవ్వలేదు. గతంలో తీసుకున్న వాటికి రెన్యూవల్ చేస్తున్నాం. ప్రత్యేక కారణాలు ఉండి, తప్పదనుకున్న పరిస్థితుల్లో అన్నీ పరిశీలించాకే గన్ లైసెన్సు ఇస్తాం. దరఖాస్తు చేసుకున్న వాళ్లందరికీ ఇవ్వలేం.

– ఫక్కీరప్ప, ఎస్పీ

**గన్ లైసెన్స్‌తో ఉద్యోగం**



నేను భారత ఆర్మీలో ఇదివరకు జమ్మూకాశ్మీర్, అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్, చండీగఢ్ తదితర ప్రాంతాల్లో పనిచేశాను. గన్ లైసెన్స్ ఉండడంతో ప్రస్తుతం ఉద్యోగం చేయడానికి అవకాశం లభించింది. ప్రస్తుతం ఎస్‌బీఐ సెక్యూరిటీ వింగ్‌లో పనిచేస్తున్నాను. ఆర్మీలో అలవడిన క్రమశిక్షణ, అంకితభావమే బ్యాంకింగ్ రంగంలో పని చేయడానికి కారణం.

– బద శంకర్‌రెడ్డి, మాజీ ఆర్మీ ఉద్యోగి

# నేడు కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష

- అనంతపురం, గుత్తిలో 47 పరీక్ష కేంద్రాలు
- ఉమ్మడి జిల్లా నుంచి హాజరుకానున్న 24,055 మంది అభ్యర్థులు
- పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామన్న ఎస్పీ ఫక్కీరప్ప



కిటకిటలాడుతున్న కళ్యాణదుర్గం రైల్వే స్టేషన్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనుంది. అనంతపురం, గుత్తిలో మొత్తం 47 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి మొత్తం 24,055 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. నేటి పరీక్షలు సజావుగా సాగేలా కృషి చేద్దామని అనంతపురం ఎస్పీ ఫక్కీరప్ప సూచించారు. శనివారం ఆయన తన చాంబర్‌లో నోడల్ అధికారులు, రీజినల్ కో ఆర్డినేటర్లు, పోలీసు అధికారులతో సమావేశమై పరీక్షల నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. అభ్యర్థులను గంట ముందుగా పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలను వెంట తీసుకురాకూడదన్నారు. మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్‌కు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. అనంతపురం, గుత్తి సెంటర్ల వద్ద డీఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో 10 ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో పర్యవేక్షించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగేంద్రుడు, హనుమంతు, డీఎస్పీలు నరసింగప్ప, ఎస్ మహబూబ్‌బాషా, సీఎం గంగయ్య, శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ సుజాత, గుత్తి గేట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సిద్ధేశ్వరరావు పాల్గొన్నారు.

**రైళ్లలో తరలిన అభ్యర్థులు**

కళ్యాణదుర్గం: అనంతపురం, చిత్తూరు, తిరుపతి తదితర ప్రాంతాల్లో పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షల రాసే అభ్యర్థులు శనివారమే బయల్దేరారు. చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు కళ్యాణదుర్గం నుంచి రైళ్లలో వెళ్లారు.

### వాహనాలకు రిఫ్లెక్ట్ టేప్ తప్పనిసరి

అనంతపురం సెంట్రల్: రాత్రి సమయాల్లో రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనాలకు రిఫ్లెక్ట్ టేప్ తప్పనిసరిగా అతికించాలని డీటీసీ శివరామప్రసాద్, మున్సిపల్ ఆర్డీ పీవీవీఎస్ మూర్తి సూచించారు. రహదారి భద్రతావారోత్సవాల్లో భాగంగా శనివారం రవాణాశాఖ కార్యాలయంలో ట్రాక్టర్లకు రిఫ్లెక్ట్ టేప్‌లను వారు అతికించి, మాట్లాడారు. ఇకపై స్టిక్కర్ లేని వాహనదారులపై కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్టీఓ సురేష్‌నాయుడు, ఎంవీఐలు రమణారెడ్డి, శ్రీనివాసులు, అతికానాజ్, సునీత, ఏఎంవీఐలు కేవీఎల్ఎన్ ప్రసాద్, రఘునాథ్ పాల్గొన్నారు.

# కూలీలకు 'ఉపాధి' పనులు కల్పించండి

- డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి

రాయదుర్గం రూరల్: ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. రాయదుర్గంలోని డ్వామా కార్యాలయంలో ఏపీడీ జయకుమార్ బాబు అధ్యక్షతన శనివారం ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సోమవారం నుంచి ప్రతి మండలంలోనూ రెండు వేల మంది కూలీలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఏపీఓ, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కూలి పనులు లేకపోవడంతో వలసలు వెళ్లారనే విషయం తెలిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఖరీఫ్‌కు సంబంధించిన వ్యవసాయ పనులు ముగియడంతో కూలీలందరికీ ఉపాధి హామీ ద్వారా పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# పెద్దారెడ్డి ప్రజా సంక్షేమ యాత్ర

- ఈనెల 26 నుంచి ప్రారంభం
- 11 రోజుల్లో 93.5 కిలోమీటర్ల పాదయాత్ర
- పెద్దవడుగూరు మండలం కాశేపల్లి నుంచి ప్రారంభం



పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి (ఫైల్)

**తాడిపత్రి:** ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు... ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మరోసారి పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. 'ప్రజా సంక్షేమ యాత్ర' పేరుతో నియోజకవర్గంలోని పెద్దవడుగూరు మండలం కాశేపల్లిలో ఈ నెల 26న పాదయాత్ర ప్రారంభం కానుంది. కాశేపల్లిలో ప్రారంభమైన యాత్ర 11 రోజుల పాటు, 93.5 కిలోమీటర్ల మేర సాగి అనంతరం పెద్దవడుగూరు మండల కేంద్రంలో భారీ బహిరంగ సభతో ముగియనుంది.


**23 గ్రామాల మీదుగా...**

- నియోజకవర్గంలోని పెద్దవడుగూరు మండలం కాశేపల్లి గ్రామంలో ఈ నెల 26న ప్రారంభమయ్యే పాదయాత్ర తొలి రోజు గుత్తి అనంతపురం, కొత్తపల్లి, విరుపాపురం మీదుగా ఆవులంపల్లి గ్రామానికి చేరుకుంటుంది. రాత్రి అక్కడే బస చేస్తారు.
- 27న ఆవులంపల్లి నుంచి జి.వెంకటాంపల్లి, మల్లేనిపల్లి మీదుగా లక్షుంపల్లికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు.
- 28న లక్షుంపల్లి నుంచి ముప్పాలగుత్తి, బుర్నాకుంట, బందార్లపల్లికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు.
- 29న అప్పేచెర్ల, కదరగుట్టపల్లి, క్రిష్టిపాడు, కొండుపల్లికి చేరుకుంటుంది.
- 30న భీమునిపల్లిలో ప్రారంభమై రావులుడికి గ్రామానికి చేరుకుంటుంది.
- 31న కోనాపురం నుంచి ప్రారంభమై చింతల చెరువు, తెలికి, మేడిమాకులపల్లికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు.
- ఫిబ్రవరి 1న మేడిమాకులపల్లి, కండ్లగూడూరు, సి.రామరాజుపల్లి, రాంపురం గ్రామానికి చేరుకుంటారు.
- ఫిబ్రవరి 2న రాంపురం నుంచి ప్రారంభమై మొలకతాళ్ల, చిత్రచేడు, చిట్టూరు, కోనేరుకు చేరుకుంటారు.
- ఫిబ్రవరి 3న గంజికుంటపల్లి, నాగలాపురం, వీరన్నపల్లికి చేరుకుని అక్కడే బస చేస్తారు.
- ఫిబ్రవరి 4న వీరన్నపల్లిలో ప్రారంభమై కొట్టాలపల్లి, దిమ్మగుడికి చేరుకుంటారు.
- ఫిబ్రవరి 5న దిమ్మగుడి నుంచి ప్రారంభమై చిన్నవడుగూరు మీదుగా పెద్దవడుగూరుకు చేరుకుని భారీ బహిరంగ సభతో ముగిస్తారు.

**నిత్యం ప్రజల్లోనే..**

నియోజకవర్గ సమన్వయకర్తగా కేతిరెడ్డి పెద్దారెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి నిత్యం ప్రజల్లోనే ఉంటూ జేసీ సోదరుల అరాచకాలను ఎదుర్కొంటూ వచ్చారు. జేసీ బాధిత ప్రజలకు అన్ని విధాలుగా అండగా నిలిచారు. సమన్వకర్తగా 'శుభోదయం తాడిపత్రి' పేరుతో తాడిపత్రిలోని వార్డుల్లో పెద్దారెడ్డి చేపట్టిన పాదయాత్రను అడ్డుకునేందుకు అప్పట్లో జేసీ సోదరులు చేయని ప్రయత్నమంటూ లేదు. ఎక్కడికక్కడ అరెస్టులు చేయించారు. పోలీసులతో బెదిరించారు. అయినా పెద్దారెడ్డి లెక్కచేయలేదు. జేసీ సోదరుల కుళ్లు, స్వార్థ, ఫ్యాక్షన్ రాజకీయాల గుట్టు రట్టు చేస్తూ వారి అరాచకాలను అడ్డుకున్నారు. ప్రజలకు నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. దీంతో 2019 సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు పెద్దారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించి పట్టం కట్టారు. తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎమ్మెల్యే పెద్దారెడ్డి రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. నిత్యమూ ప్రజల్లో ఉంటూ వారి కష్టసుఖాలను తెలుసుకుంటున్నారు.

## నెట్టికంటుడిని దర్శించుకున్న రైల్వే ఏజీఎం



తీర్థ ప్రసాదాలు అందుకున్న రైల్వే అడిషినల్ జనరల్ మేనేజర్ దంపతులు

**గుంతకల్లు రూరల్:** రైల్వే అడిషినల్ జనరల్ మేనేజర్ ఉదయ్‌కుమార్ రెడ్డి శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో కలసి సాయంత్రం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామి తీర్థప్రసాదాలను అందజేశారు.



## క్రీడలతో మానసిక వికాసం

- బెస్ట్-యూ స్పోర్ట్స్ డేలో భరత్‌లాల్ మీనా



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న భరత్‌లాల్ మీనా, రూపా వాసుదేవన్

**పుట్టపర్తి అర్బన్:** క్రీడల ద్వారా మానసిక, శారీరక వికాసం పెంపొందుతుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి, బెంగళూరు గట్టి వ్యాలీ ఫౌండేషన చైర్మన్ భరత్‌లాల్ మీనా అన్నారు. గోరంట్ల మండలం గౌనివారిపల్లి వద్ద ఉన్న భారతీయ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ (బెస్ట్-యూ)లో స్పోర్ట్స్‌డేను శనివారం ఆయన ప్రారంభించారు. బెస్ట్-యూనివర్సిటీ చాన్సలర్ రూపా వాసుదేవన్, వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్.చితిరై చల్వన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ నెల 25వ తేదీ వరకూ జరిగే క్రీడా పోటీల్లో 60 జట్లు పాల్గొననున్నాయి. ఏపీలోని పలు జిల్లాలకు చెందిన జట్లతో పాటు కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున క్రీడాకారులు తరలివచ్చారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో బాలురు, బాలికలు పాఠశాల, ఇంటర్, డిగ్రీ స్థాయిలో పోటీ పడనున్నారు. క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం టాస్ వేసి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. విజేత జట్లకు ఈ నెల 26న బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి బారతదేశ తొలి ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్ అంజూబాబీ జార్జ్ హాజరు కానున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అడ్వకేట్ సుబ్రహ్మణ్య, కమ్యూనికేషన్ అండ్ ఇంటర్నేషనల్ అఫైర్స్ డైరెక్టర్ నితిన్ పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమంలో మీడియా పాత్ర కీలకం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గరికపాటి దీనబాబు



మాట్లాడుతున్న దీనబాబు

**అనంతపురం సిటీ:** ప్రజా సంక్షేమంలో మీడియా పాత్ర కీలకమని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి గరికపాటి దీనబాబు అన్నారు. న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా కార్యాలయ ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన సదస్సులో చట్టాలపై విలేకరులకు ఆయన అవగాహన కల్పించారు. ప్రజా సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ పలు సందర్భాల్లో పత్రికల్లో వచ్చిన కథనాలపై స్పందించి, సుమోటోగా కేసులు నమోదు చేసిన ఉదంతాలను వివరించారు. వినియోగదారుల చట్టాలపై వినియోగదారుల సంఘం జిల్లా సభ్యులు గ్రేస్‌మేరీ, గోపీనాథ్ అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సహాయం, డిఫెన్స్ లీగల్ కౌన్సెల్ విధానం, పర్యావరణ పరిరక్షణ చట్టాల గురించి డిప్యూటీ చీఫ్ డిఫెన్స్ కౌన్సెల్ నల్లప్ప, నగర పాలక సంస్థ లీగల్ స్టాండింగ్ కౌన్సెల్ ఉమాపతి, మధ్యవర్తిత్వ కేంద్రం సభ్యుడు హరికృష్ణ తదితరులు మాట్లాడారు.

# చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప

**తాడిపత్రి అర్బన్:** వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ముఠాలోని ఇద్దరు సభ్యులను తాడిపత్రి పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.6 లక్షల విలువ చేసే బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. తాడపత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప వెల్లడించారు. గుత్తి, తాడిపత్రి ప్రాంతాల్లో ఇటీవల వరుస చైన్ స్నాచింగ్‌లో చోటు చేసుకున్నాయి. ఆయా ఘటనలపై కేసులు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో ఇద్దరిని అరెస్ట్ చేసి, 1.2 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో కుందుర్పి మండలం వెంకటాంపల్లికి చెందిన మారుతీప్రసాద్, రాంలాల్‌నాయక్ ఉన్నారు. వీరిపై గతంలో కళ్యాణదుర్గం, రాప్తాడు, బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్లలో చోరీ కేసులు నమోదయ్యాయి. కళ్యాణదుర్గంలో నమోదైన ఓ కేసులో మారుతీప్రసాద్‌కు మూడు నెలల జైలు శిక్ష పడింది. చైన్ స్నాచర్లను అరెస్ట్ చేసిన డీఎస్పీ చైతన్య, టౌన్ సీఐ ఆనందరావు, ఎస్‌ఐ ధరణీబాబు, ఏఎస్‌ఐ రాజశేఖర్, హెడ్‌కానిస్టేబుల్ చాంద్, మధు, కానిస్టేబుళ్లు కిషోర్, శ్రీనునాయక్, గోవిందు, రిజ్వాన్ వలిని ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు. వీరికి త్వరలో రివార్డును అందజేయనున్నట్లు తెలిపారు.

## అక్రమ మద్యం స్వాధీనం

**తాడిపత్రి:** స్థానిక ఆటోనగర్‌లో టాటాఏస్ వాహనంలో తరలించేందుకు సిద్ధంగా ఉంచిన మహారాష్ట్రకు చెందిన 200 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. మద్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. పరారీలో ఉన్న వాహన యజమాని, అక్రమ మద్యం రవాణాదారుల కోసం గాలిస్తున్నట్లు వివరించారు.

## కృష్ణానది యాజమాన్య బోర్డు కర్నూలులోనే ఏర్పాటు చేయాలి

- అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి అధ్యక్షుడు కేవీ రమణ

**అనంతపురం టవర్‌క్లాక్:** శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం కృష్ణానది యాజమాన్యం బోర్డు కార్యాలయాన్ని కర్నూలులోనే ఏర్పాటు చేయాలని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి అధ్యక్షుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. అనంతపురంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా నది జలాల నిర్వహణ కోసం యాజమాన్య బోర్డు ఏర్పాటు చేసే అంశం ఏపీ విభజన చట్టంలో స్పష్టంగా పొందుపరిచారని గుర్తు చేశారు. దీని ప్రకారం బోర్డు ఏర్పాటు నిర్ణయం హక్కు ఏపీ ప్రభుత్వానికి కల్పించారన్నారు. ఇలాంటి తరుణంలో బోర్డు కార్యాలయాన్ని విశాఖలో ఏర్పాటు చేయానుకోవడం సరైంది కాదన్నారు. నీటి సమస్యలు తలెత్తినప్పుడు విశాఖకు వెళ్లే పరిస్థితి ఇబ్బందిగా ఉంటుందన్నారు. ఈ పరిస్థితి తలెత్తకుండా బోర్డును కర్నూలులోనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నట్లు పేర్కొన్నారు. తన మనుగడ కోసం రాయలసీమ మీద లేని ప్రేమను బైరెడ్డి రాజశేఖరరెడ్డి చూపుతున్నారని, ఆయనను ఎవరూ నమ్మరాదని కోరారు. రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు సుబ్రహ్మణ్యం, హనుమన్న, కుమార్, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.



# అసత్య ప్రచారాలు మానుకోండి

- టీడీపీ నేతలకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య హితవు



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

**అనంతపురం సప్తగిరి సర్కిల్:** బలహీన వర్గాలకు చెందిన మహిళ మంత్రిపై టీడీపీ నేతలు సాగిస్తున్న తప్పుడు ప్రచారాలను ఖండిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పేర్కొన్నారు. ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, డీసీసీబీ మాజీ చైర్మన్ పామిడి వీరాతో కలసి శనివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి ఉషశ్రీచరణ్ చొరవతో కళ్యాణదుర్గం నియోజవకర్గ వ్యాప్తంగా గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. దీంతో నియోజవకర్గంలో తమ ఉనికిని కాపాడుకునేందుకు టీడీపీ నేతలు ఇష్టానుసారంగా చేస్తున్న ఆరోపణలకు పచ్చ మీడియా వత్తాసు పలుకుతూ విష ప్రచారాన్ని సాగిస్తుండడం హేయమన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన ఈ మూడున్నరేళ్ల ప్రజా సంక్షేమాన్ని ఏ మాత్రం పట్టించుకోని టీడీపీ నేతలు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజల్లో అలజడులు సృష్టించేందుకు నీచ రాజకీయాలకు తెరలేపడం సిగ్గు చేటన్నారు. అసైన్డు భూములను కొనుగోలు చేసే పరిస్థితి టీడీపీ హయాంతోనే పోయిందన్నారు. జగన్ సర్కార్ అన్నింటా పారదర్శకంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ క్రమంలో అసైన్డు భూములు కొనుగోలు చేసే పరిస్థితికి తావులేకుండా పోయిందన్నారు. 70 ఎకరాల స్థలాన్ని కబ్జా చేశారంటూ ఇష్టారాజ్యంగా మాట్లాడడం సబబు కాదని, ఇందుకు ఆధారాలు చూపాలన్నారు. టీడీపీ నేతలు ఆరోపించిన సర్వే నంబర్ 225లోని భూమి యజమానుల వివరాలను పరిశీలించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, దమ్ముంటే తమతో పాటు రిజిస్టర్ కార్యాలయానికి రావాలని సవాల్ విసిరారు. కోవిడ్ సమయంలో కనీసం కాళ్లు కూడా బయటకు పెట్టలేని వారు మంత్రిని టార్గెట్ చేసి మాట్లాడితే కళ్యాణదుర్గం టీడీపీ టికెట్ దక్కుతుందనే భ్రమలో ఉన్నారని ఎద్దేవా చేశారు. లోకేష్ డైరెక్షన్‌లో ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేసి టికెట్‌ను దక్కించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారన్నారు. మహిళలు, బీసీల జోలికి వస్తే పాతాళంలో కూడా చోటు ఉండదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

## ముగిసిన ఎస్జీటీల వర్క్ అడ్జెస్ట్‌మెంట్

**అనంతపురం:** డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ (30 శాతం)కోటాలోని సీనియర్ ఎస్జీటీలకు సబ్జెక్టు టీచర్లు (స్కూల్ అసిస్టెంట్)గా అవకాశం కల్పించేందుకు నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం ముగిసింది. సైన్స్ సెంటర్‌లో నిర్వహించిన ఈ ప్రక్రియకు స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్)కు మొత్తం 140 మందిని ఆహ్వానించగా, 50 మంది, స్కూల్‌అసిస్టెంట్ (మేథమేటిక్స్)కు సంబంధించి మొత్తం 60 మందికి గాను, 19 మంది సమ్మతి తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ సోషల్‌స్టడీస్‌కు మొత్తం 15 మందికి గాను, కేవలం ఒకరు మాత్రమే సమ్మతి తెలిపారు.

## క్లుప్తంగా

### వైఎస్సార్ బీమా తక్షణ సాయం

ఆత్మకూరు: వడ్డుపల్లిలో మురళి అనే యువకుడు మృతి చెందగా, వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలు శనివారం అందించినట్లు సర్పంచు లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల అధ్యక్షుడు వడ్డుపల్లి నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఓబిరెడ్డి, శివారెడ్డి , ఈవోఆర్డీ సత్యబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### నేడు నీటి సరఫరా బంద్

అనంతపురం క్రైం: నగరంలో ఆదివారం నీటి సరఫరా ఉండదని నగరపాలక సంస్థ ఎస్‌ఈ నాగమోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. హంసపల్లి వద్ద ఉన్న నగర ప్రజలకు సరఫరా చేసే తాగునీటి మెయిన్ పంపింగ్ లైను లీకేజీతో సమస్య తలెత్తిందన్నారు.

### మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేస్తాం

అనంతపురం టవర్‌క్లాక్: బళ్లారి – పంగల్ రోడ్డులో మహనీయుల విగ్రహాలను అధికారులతో చర్చించి, త్వరలో ఏర్పాటు చేస్తామని జాతీయ రహదారులశాఖ ఈఈ మధుసూదనరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారుల కమిటీ ప్రస్తుతం ఆర్డీటీ వ్యవస్థాపకుడు విన్సెంట్ ఫెర్రర్ విగ్రహాన్ని కలెక్టరేట్ ఎదురుగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మిగిలిన విగ్రహాలు అధికారుల కమిటీ నిర్ణయం ప్రకారం త్వరలోనే ఏర్పాట్లు చేస్తామన్నారు.

### నేడు తరిమెల పుస్తకాల సమీక్ష

అనంతపురం కల్చరల్: ప్రముఖ అభ్యుదయ రచయిత తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి రచనలపై ఆదివారం పుస్తక సమీక్ష ఉంటుందని మానవతా సంస్థ కోకన్వీనర్ సలీంమాలిక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎన్‌జీఓ హోంలో తరిమెల అమరథనాథరెడ్డి రచించిన మేరా భారత్ మహాన్ నూతన పుస్తకావిష్కరణతో పాటు 11 పుస్తకాలపై సమీక్ష ఉంటుందన్నారు. ప్రముఖ సాహితీ విమర్శకులు రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, ప్రముకవి, అస్తిత్వ యుద్ధయోదుడు డాక్టర్ బావికాటి రాఘవేంద్ర హాజరవుతారన్నారు.

### రేపు కంటి వైద్యశిబిరం

ఆత్మకూరు: స్థానిక జూనియర్ ప్రభుత్వ కళాశాలలో ఈ నెల 23న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ హేమలత శనివారం తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 23 న బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 2 గంటల వరకు ఉంటుందన్నారు.

### జేసీఎస్ మండల అధ్యక్షుడిగా వడ్డుపల్లి నరసింహారెడ్డి



ఆత్మకూరు: మండల (జేసీఎస్) జగనన్న సచివాలయం కన్వీనర్లు, గృహసారథుల మండల అధ్యక్షుడిగా వడ్డుపల్లికి చెందిన నరసింహారెడ్డిని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అధికారికంగా నియమించినట్లు నరసింహారెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించారని, ప్రజలకు అందుబాటులో ఉండి, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తామన్నారు. జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు నిరంతరం అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన సీఎం జగనన్నకు, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి రుణపడి ఉంటానన్నారు.

### అనంతలో విద్యాస్ఫూర్తి ఎక్స్‌పో



విద్యాస్ఫూర్తి ఎక్స్‌పోలో పాల్గొన్న విద్యార్థులు

అనంతపురం: స్థానిక గుత్తి రోడ్డులోని కేటీఆర్ కన్వెన్షన్ హాలులో విద్యాస్ఫూర్తి ఎక్స్‌పో నిర్వహించారు. శనివారం ప్రారంభమైన విద్యాస్ఫూర్తి ఎక్స్‌పో రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులు ఎక్స్‌పోలో పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఇంటర్మీడియట్ అనంతరం ఎలాంటి కోర్సులు ఎంపిక చేసుకోవాలి.. బెంగళూర్‌లోని ప్రముఖ ఇంజినీరింగ్, మెడికల్, మేనేజ్‌మెంట్ కోర్సులను ఎంపిక చేసుకునేందుకు కలిగించే అవకాశాలను అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా విద్యాస్ఫూర్తి ఎక్స్‌పో నిర్వహించారు.

### మహిళను ఏమార్చి నగలు చోరీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగులో నుంచి ఇద్దరు మహిళలు చాకచక్యంగా రెండు తులాలు బంగారు నగలతో శనివారం ఉడాయించారు. త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి...కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన గీతా వాణీ అనే మహిళ అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌లో కర్నూలుకు వెళ్లేందుకు బస్సు ఎక్కింది. గుర్తుతెలియని ఇద్దరు మహిళలు కూడా తోటి ప్రయాణికుల్లా బస్సెక్కారు. స్థానిక గుత్తిరోడ్డులోని విద్యుత్ కళాభారతి వద్దకు వెళ్లగానే, గీతావాణీకి చెందిన బ్యాగును తీసుకొని బస్సు దిగిపోయారు. కొంతదూరం వెళ్లాక తన బ్యాగు గుర్తొచ్చి చూసుకుంటే నగలు కనిపించలేదు. బాధితురాలు తిరిగిన త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# ప్రభుత్వ చేయూతతో గట్టెక్కాం



42వ డివిజన్‌లో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామి రెడ్డి

= క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం చేయూత ద్వారా అందించిన రూ.18,750తో గట్టెక్కామని వెంకటలక్ష్మి అనే మహిళ ఎమ్మెల్యేతో ఆనందాన్ని పంచుకుంది. తన కోడలు ప్రసవానికి ఆ డబ్బులు వాడుకున్నామని, ప్రభుత్వ మేలును మర్చిపోలేమని తెలిపింది. ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ అందజేస్తున్నారని శ్రీనివాసులు అనే స్థానికుడు తెలిపాడు. చేయూత ద్వారా వచ్చిన డబ్బులను వస్త్ర వ్యాపారానికి వినియోగించుకున్నామని లలితమ్మ అనే మహిళ తెలిపింది. చేయూత ద్వారా వచ్చిన డబ్బులతో కాయగూరల వ్యాపారం చేసుకుంటున్నానని రామాంజినమ్మ తెలిపింది. విజయమ్మ అనే హోటల్ నిర్వాహకురాలు సబ్సిడీ రుణం కోసం ఎమ్మెల్యేను విన్నవించింది. అందుకు తగు చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఓ. డాక్టర్ దామోదర్ రెడ్డిని ఎమ్మెల్యే ఆదేశించారు. మిట్టపై ఉండడంతో నీరు వేగంగా (ఫోర్స్) రావడం లేదని రాధమ్మ, సమీరా, టీబీ మహిళలు ఎమ్మెల్యేను కోరారు. కళావతి అనే వితంతువుకు పింఛన్ మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని వెల్ఫేర్ కార్యదర్శి చిరంజీవిని ఎమ్మెల్యే ఆదేశించారు.

అనంతపురం క్రైం: నెలన్నర వ్యవధిలో కామారుపల్లిలో స్థలం పొందిన లబ్ధిదారులకు మరో అనువైన ప్రాంతంలో స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి హామీ ఇచ్చారు. శనివారం 42వ డివిజన్ 6వ రోడ్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ రహంతుల్లా, డివిజన్ కన్వీనర్ కురుబ చంద్రతో కలిసి మూడున్నరేళ్ల పాలనలో వైఎస్సార్ ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించారు. నలిని, నరసమ్మ, శారద, ఆదిలక్ష్మి, సుజాత, తదితర లబ్ధిదారులు కామారుపల్లిలో ఇచ్చిన స్థలం సమస్యను ఎమ్మెల్యేకి విన్నవించారు. రాచానపల్లి, కందుకూరు, కురుకుంట ప్రాంతాల్లో స్థలాలు చూస్తున్నామని, 6,900 మంది లబ్ధిదారులకు అనువైన ప్రాంతంలో స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టా ఉన్న వారికి ప్రభుత్వం ఇళ్ల నిర్మించుకోవడానికి రూ.1,80,000 ఇస్తుందన్నారు.

**రూ.12లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తాం :** మహిళా సంఘాల సభ్యుల విజ్ఞప్తి మేరకు రూ.12 లక్షలతో కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులను సచివాలయ కార్యదర్శుల పరిధిలో పని చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డిని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు కాగజ్‌ఘర్ రిజ్వాన్, డైరెక్టర్లు గౌస్‌బేగ్, శ్రీనివాసులు, గోయిందు, కార్పొరేటర్లు మల్లెమీద నరసింహులు, సైఫుల్లాబేగ్, శేఖర్‌బాబు, ఇస్హాక్, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, కొర్రపాడు హుస్సేన్‌పీరా, సద్దాం హుస్సేన్, జావేద్, కృష్ణవేణి, గౌరి, చంద్రశేఖర్ యాదవ్, శ్రీదేవి, భారతి పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కార్పొరేషన్ల డైరెక్టర్లు

### ఎమ్మెల్యే అనంతకు సన్మానం

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ప్రభుత్వం రాష్ట్రంలోని 55 కార్పొరేషన్ల పదవి కాలాన్ని మరో రెండేళ్ల పొడిగించి, గతంలో ఉన్న వారినే కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై ఎమ్మెల్యేను కలిసి ధన్యవాదాలు తెలిపారు. వారు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం చొరవ చూపుతోందన్నారు. రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, తమ్మినేని రాఘవేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు నవీన్‌కుమార్, నాగేంద్ర, దివాంజి పాల్గొన్నారు.

## ఇంటి పట్టాల మంజూరుకు కసరత్తు



తహసీల్దార్, సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ మధుసూదన్

రాప్తాడురూరల్: అనంతపురం అర్బన్, రూరల్ మండలంలోని 7,300 లబ్ధిదారులకు అనంతపురం రూరల్ మండలం కామారుపల్లి వద్ద 173 ఎకరాల్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. అయితే ఈ భూమిలో నీరు ఉబుకుతుండడంతో ప్రత్యామ్నాయానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. పేదలందరికీ ఇంటిపట్టాల అంశాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవడంతో 7,300 మందికి ఇంటిపట్టాలకు భూమిని పరిశీలించేందుకు రెవెన్యూ అధికారులు కొద్దిరోజులుగా తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా పలుచోట్ల భూములను పరిశీలించారు. ఈ విషయమై ఆర్డీఓ మధుసూదన్ శనివారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తహసీల్దార్ శ్రీధర మూర్తి, డిప్యూటీ తహసీల్దార్ దేవన్‌రాజా, సీనియర్ అసిస్టెంట్ ఈశ్వర్‌రెడ్డి, పలువురు వీఆర్‌ఓలతో సమావేశం ఏర్పాటు చేశారు. కురుగుంట, రాచానపల్లి, కందుకూరుతో పాటు బుక్కరాయసముద్రం మండలం సిద్ధరాంపురం సమీపంలో భూములు పరిశీలించారు. రికార్డులను ఆర్డీఓ పరిశీలించారు. వీలైనంత త్వరలో 'కామారుపల్లి' లబ్ధిదారులందరికీ ఇంటి స్థలాలు కేటాయిస్తామని ఆర్డీఓ తెలిపారు.

### వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

రాప్తాడు: పదో తరగతి విద్యార్థులు ఈ ఏడాది వంద శాతం ఫలితాలు సాధించాలని తహసీల్దార్ లక్ష్మీనరసింహులు, ఎంపీడీఓ సాల్మన్ ఉపాధ్యాయులకు సూచించారు. కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు మండల కేంద్రం రాప్తాడులోని జెడ్పీహెచ్‌ఎస్‌ను తహసీల్దార్, మరూరు జెడ్పీహెచ్‌ఎస్‌ను ఎంపీడీఓ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. సమ్మెటివ్ పరీక్షల్లో ఎవరెవరికి ఎన్ని మార్కులు వచ్చాయని ప్రశ్నించారు. బాగా మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నరసింహులు, చెన్నకేశవమ్మ, సర్వేయర్ రామాంజనేయులు, వీఆర్వో లక్ష్మన్న, పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, పీడీ కేశవ మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రీసర్వే పూర్తి చేయండి

రాప్తాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వేను త్వరగతిన పూర్తి చేయాలని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ గోపినాథ్ తెలిపారు. శనివారం ఆయన బొమ్మేపర్తి లో జరుగుతున్న రీసర్వేను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రీసర్వే చేపడుతోందన్నారు. ఈఓఆర్డీ మాధవి, వీఆర్వో లింగారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రామచంద్రా రెడ్డి, నవీన్ కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చంద్ర, వీలేజ్ సర్వేయర్ భార్గవ పాల్గొన్నారు.

### పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

అనంతపురం కల్చరల్: సచివాలయ అభ్యర్థులకు ఈ నెల 23 నుంచి స్థానిక లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు 40 రోజుల పాటు ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాజశేఖర్ శనివారం తెలిపారు.

## గాండ్లపర్తిలో పలువురికి ఆర్థిక సాయం



గాండ్లపర్తి గ్రామంలో ఆర్థిక సాయం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాప్తాడు: మండలంలోని గాండ్లపర్తికి చెందిన ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత, ఆర్థిక ఇబ్బందులున్న వారికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి శనివారం ఆర్థిక సాయం అందించారు. ఈనెల 5న గాండ్లపర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తమకు ఆర్థికసాయం చేయాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. దీంతో ఆయన చేతుల మీదుగా రూ. 2 లక్షలు అందించారు. శనివారం కూడా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి గ్రామానికి వెళ్లి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు దాదాపుగా 10 మంది బాధితులకు రూ.3 లక్షలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు డొక్కా రామచంద్ర, సన్నప్పయ్య, రమేష్, శివయ్య, శంకర్, ప్రసాద్, రాఘవ రెడ్డి, పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

## జేఎన్‌టీయూలో బదిలీలు, హోదాల్లో మార్పు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ)లో పలువురు డైరెక్టర్ల హోదాల్లో మార్పు చేశారు. అలాగే పలువురు ప్రొఫెసర్లను బదిలీ చేశారు. ఈ మేరకు జేఎన్‌టీయూ (ఏ) వీసీ జింకా రంగజనార్థన ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ సి.శశిధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్యను జేఎన్‌టీయూ–కలికిరిఇంజినీరింగ్‌కళాశాలకు బదిలీ చేశారు. రిజిస్ట్రార్ శశిధర్‌కు డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ కన్సెల్టెన్సీ సర్వీసెస్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ సురేష్ బాబుకు డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ఆడిట్‌గా కీలకమైన అదనపు బాధ్యతలు అప్పగించారు. డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్‌గా ఉన్న ప్రొఫెసర్ బి.ఈశ్వరరెడ్డికి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యత ఇచ్చారు. ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తికి స్పెషల్ ఆఫీసర్, సెంటర్ ఫర్ బ్రిడ్జి, టన్నెల్ ఇంజినీరింగ్, జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాలలో నియమించారు. జేఎన్‌టీయూ–పులివెందుల కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఎస్.వసుంధరను నియమించారు. డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ప్లానింగ్‌తో పాటు ఇండస్ట్రియల్ రిలేషన్స్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌గా ప్రొఫెసర్ వి.సుమలతకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఓటీపీఆర్ఐలోని బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.విజయలక్ష్మిని జేఎన్‌టీయూ–కలికిరి విభాగాధిపతిగా నియమించారు. పులివెందులలోని జేఎన్‌టీయూ మేథమేటిక్స్ విభాగం ప్రొఫెసర్ ఎం.చెంగల్ రాజును జేఎన్‌టీయూ–కలికిరికి బదిలీ చేశారు.

### ఉరి వేసుకొని మెకానిక్ మృతి

రాప్తాడు: స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోని ఎదురుగా ఉన్న బీసీ కాలనీలో షేక్ మస్తాన్‌వలి (28) ఉరివేసుకొని శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. బాధితుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు.. నగరంలోని పాపంపేటకు చెందిన షేక్ మస్తాన్‌వలి రాప్తాడు ఆటోనగర్‌లో లారీ మెకానిక్ పని చేస్తూ జీవనం చేస్తున్నాడు. ఐదురోజుల క్రితం పోలీస్ స్టేషన్ సమీపంలో ఓ ఇల్లు అద్దెకు తీసుకొని భార్య ఖైరూన్, మూడు నెలల కుమారుడితో కలిసి ఉంటున్నాడు. అప్పటి నుంచి భార్యాభర్తలు ఘర్షణ పడ్డారు. శనివారం కూడా షేక్‌మస్తాన్ వలితో గొడవపడి భార్య ఖైరూన్ ఇంటి నుంచి వెళ్లిపోయింది. మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అప్రమత్తతతోనే తెగుళ్ల నివారణ



వేరుశనగ పంటలో తెగుళ్ల గురించి రైతులకు వివరిస్తున్న ఏఓ శుభకర్

రాప్తాడు: అప్రమత్తతతోనే తెగుళ్ల నివారించుకోవచ్చని ఏఓ శుభకర్ రైతులకు సూచించారు. శనివారం గంగలకుంట గ్రామంలో వేరుశనగ పంటకు ఆశించిన తెగుళ్లపై అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ బోరు బావుల కింద సాగు చేసిన వేరుశనగ పంట ఆశాజనకంగా ఉందని, ప్రస్తుతం పూత దశలో ఉందని అక్కడక్కడ వేరుశనగ పంటకు తెగుళ్ల ఆశించాయన్నారు. ఏ తెగులుకు ఏ మందు పిచికారీ చేయాలో వివరించారు. రబీలో పంటలు సాగు చేసిన రైతులు తప్పకుండా ఈ–క్రాప్ బుకింగ్ చేపించుకోవాలన్నారు. రైతులు పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకుని, ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ శ్రీనివాసులు, వీహెచ్‌ఏ సోనియా, రైతులు తదితరులు ఉన్నారు.

### మార్మోగిన పురందర సంకీర్తన

అనంతపురం సెంట్రల్: ప్రఖ్యాత వాగ్గేయకారుడు పురందరదాసు ఆరాధనోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. నగరంలో శ్రీ మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠంలో తెల్లవారుజాముున భక్తులు, సంగీత కళాకారులు పురవీధుల్లో నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం మఠంలో శ్రీరాఘవేంద్రస్వామి బృందావనానికి ప్రత్యేక అలంకార సేవలు, అభిషేకాలు చేశారు. పురందరదాస పాటలను ఆలపించారు.

### క్రికెట్ టోర్నీ నిర్వహణకు సర్వం సిద్ధం

- మ్యాచ్ రెఫరీ సునీల్ చతుర్వేది




పిచ్‌ను పరిశీలిస్తున్న మ్యాచ్ రెఫరీలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంత క్రీడా మైదానంలో ఈనెల 22 నుంచి 25 వరకు నిర్వహించనున్న టోర్నీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మ్యాచ్ రెఫరీ సునీల్ చతుర్వేది తెలిపారు. ఆయన శనివారం ప్రధాన క్రీడా మైదానంలోని పిచ్‌ను పరిశీలించారు. ఆంధ్ర, గుజరాత్ జట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుందన్నారు. ఆంధ్ర జట్టు కెప్టెన్ గిరినాథ్‌రెడ్డి, గుజరాత్ జట్టు కెప్టెన్‌క్షితిజ్ పటేల్, అంపైర్లు నిఖిల్ మెనన్, సుబ్రహ్మణ్యం అయ్యర్, స్కోరర్లు తోట విజయ్, చైతన్య, వీడియో ఆనాలిస్ట్ అశోక్, రహిమాన్, యాంటీ కరప్షన్ లైజినింగ్ ఆఫీసర్ సిరి నిరంజన్ పాల్గొన్నారు.

### ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

ఆత్మకూరు: పి.యాలేరులో అధికారులతో కలసి జగనన్న ఇంటి నిర్మాణ పనులను ఎంపీపీ పొన్నపాటి నీలిమ శనివారం పరిశీలించారు. గ్రామంలో మొత్తం 83 మంది ఇంటి నిర్మాణ పనులు చేపట్టారన్నారు. పనులు ప్రారంభించని వారికి గ్రామ వలెంటరీలు, సచివాలయ సిబ్బంది చొరవచూపి పనులు వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. ఎంపీడీఓ కొండన్న, ఈవోఆర్డీ సత్యబాబు, సర్పంచ్ ఆరోగ్యం రెడ్డి, సెక్రటరీ ఖాదర్‌వలి, ఈఏ మధు తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి టెన్నిస్ క్రికెట్ బాల్ పోటీలకు ఎంపిక



కేసాయి దినేష్ కార్తిక్‌ను అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం: శ్రీ చైతన్య విద్యా సంస్థలో (కోర్టు రోడ్డు) 8వ తరగతి చదువుతున్న కే సాయి దినేష్ కార్తిక్ జాతీయ స్థాయి టెన్నిస్ క్రికెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల ఏలూరు జిల్లాలోని చింతలపూడిలో జనవరి 10,11, తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చూపాడు. విద్యార్థిని శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ తబుస్సుమ్ అభినందించారు.

### అమీన విధులకు ఆటంకం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కోర్టు అమీన విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ రవిశంకర్‌రెడ్డి బుధవారం మీడియాకు వెల్లడించారు. వేణుగోపాల్ నగర్ సమీపాన ఎన్‌టీఆర్ మార్గ్ వద్ద వివాదంలో ఉన్న మూడు సెంట్ల స్థలాన్ని రఘునాథరెడ్డికి అనుకూలంగా కోర్టు ఉత్తర్వులు వచ్చాయి. అయితే ఆ స్థలాన్ని దండు శ్రీనివాసులు అనే వ్యక్తి ఆక్రమించాడు. అతడు ఖాళీ చేయడానికి ససేమిరా అనడంతో రఘునాథరెడ్డి కోర్టును ఆశ్రయించాడు. అనంతరం కోర్టు అమీన సదరు స్థలం వద్దకు వచ్చి యజమానికి స్వాధీనం చేయించేందుకు ప్రయత్నించగా ఆక్రమణదారుడు అడ్డుకున్నాడు. అమీన ఫిర్యాదుతో సదరు వ్యక్తిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

### ప్రతి ఇంటికీ నీరందించడమే లక్ష్యం



కట్టకిందపల్లిలో సర్పంచ్, అధికారులతో జేజేఎం కేంద్ర కమిటీ సభ్యులు

రాప్తాడురూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే జల జీవన్ మిషన్ (జేజేఎం) లక్ష్యమని జల జీవన్ మిషన్ కేంద్ర కమిటీ సభ్యులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కపిల్దేవ్ శర్మ, కులదీప్ బద్వాల్ అన్నారు. శనివారం అనంతపురం రూరల్ మండలం కట్టకిందపల్లి, కామారుపల్లిలో వారు పర్యటించారు. తాగునీటి కొళాయిలు, నీటి సరఫరాను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో నీటి లభ్యత ఎలా ఉంది.. క్వాలిటీ ఉంటోందో.. అందరికీ సరిపడా నీరు సరఫరా అవుతోందా? అని ప్రజలను అడిగారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్టులో 2024 లోపు ప్రతి ఇంటికీ కొళాయి ఏర్పాటు చేస్తారన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వసీమా రెహానా, ఏఈ ఆంజనేయులు, సర్పంచ్‌లు శోభ, లక్ష్మీకళ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### నేటి నుంచి లఘు చిత్ర వారోత్సవాలు



మాట్లాడుతున్న రషీద్ బాషా, తదితరులు

అనంతపురం కల్చరల్: నగరంలో జిల్లాకు చెందిన సినీ, టీవీ దర్శకుడు రషీద్ బాషా నేతృత్వంలో ఈ నెల 22 నుంచి 29 వరకు అనంత లఘు చిత్ర వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం అనంత ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ కార్యాలయంలో దర్శకుడు రషీద్‌బాషా సినీ, బుల్లితెర నటుడు రమేష్ నీల్ విలేకరులతో మాట్లాడారు. 22న విద్యుత్ కళా వేదిక మినీ థియేటర్‌లో మొబైల్ ఫిల్మ్ మేకింగ్‌లో శిక్షణ, 24న ఎస్ఎస్ ప్యారడైజ్ కాన్ఫరెన్స్ హాల్‌లో అనంత షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ , 26,27 తేదీల్లో విద్యుత్ కళా వేదికలోని మినీ థియేటర్‌లో 40 లఘు చిత్రాల పద్రర్శన , 28న విద్యుత్ కళా వేదిక మినీ థియేటర్‌లో మొబైల్ ఫిల్మ్ మేకింగ్‌లో లఘు చిత్రాల ప్రదర్శన , 29న మాసినేని గ్రాండ్ ఫంక్షన్ హాలులో అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు.

### ఆశా పోస్టులకు ఇంటర్వ్యూలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని రెండో రోడ్డు అర్బన్ హెల్త్ సెంటర్, శ్రీనివాసనగర్ హెల్త్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న ఆశా పోస్టుల భర్తీకి శనివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్ నేతృత్వంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 48 మంది దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ వైద్యాధికారి గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

### మోడల్ పరీక్ష

అనంతపురం అర్బన్: కానిస్టేబుల్ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ పరీక్షను సంఘం నాయకులు శనివారం నిర్వహించారు. స్థానిక రెండో రోడ్డులోని పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభ్యర్థులకు మోడల్ పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్‌కుమార్, సంతోష్ కుమార్, నగర కార్యదర్శి మోహన్‌కృష్ణ, నాయకులు లిఖిల్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

### రేపటి నుంచి జిల్లా స్థాయి జూడో ఎంపికలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా సబ్ జూనియర్, క్యాడెట్ జూడో క్రీడాకారుల ఎంపికలను ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా జూడో అసోసియేషన్ కార్యదర్శి కేఎస్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక అనంత క్రీడా గ్రామంలోని జూడో అకాడమీలో ఎంపికలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఈ నెల 22న సాయంత్రం 4 గంటలకు బాలికలు, 23 సాయంత్రం 4 గంటలకు స్థానిక ఆర్డీటీ క్రీడా మైదానంలో చేరుకోవాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరి 3 నుంచి 5 వరకు కర్నూలు జిల్లాలోని నందికొట్కూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

### ఎస్కేయూ మహిళల ఖోఖో జట్టు ఎంపిక



ఎస్కే యూనివర్సిటీ ఖోఖో జట్టు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఎస్కే యూనివర్సిటీ మహిళల ఖోఖో జట్టును శనివారం ప్రకటించారు. ఈ నెల 23 నుంచి బెంగళూరులోని అలయెన్స్ యూనివర్సిటీలో జరిగే ఆలిండియా సౌత్‌జోన్ అంతర్ యూనివర్సిటీల పోటీల్లో ఎస్కే యూనివర్సిటీ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనుంది. జట్టును ఎస్కే యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఎస్కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ శ్రీనివాసన్, పీడీ విజయలక్ష్మి, రాము పాల్గొన్నారు.

### ఇళ్ల నిర్మాణాలకు రూ.5 లక్షలు ఇవ్వాలి

రాప్తాడు: ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన జగనన్న ఇళ్ల నిర్మాణాలకు రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి రవీంద్ర డిమాండ్ చేశారు. శనివారం ఆయన సీపీఐ నాయకులతో కలిసి రాప్తాడులోని జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో సంకాల సేకరణ చేశారు.

### ఆక్రమణల తొలగింపు

అనంతపురం క్రైం: నగరంలోని అంబేడ్కర్‌నగర్‌లో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ శనివారంతో పూర్తయ్యింది. అంబేడ్కర్‌నగర్‌లో రోడ్డు, కాలువ వేయడానికి ఆక్రమణలు తొలగించాలని అధికారులు నిర్ణయించారు. అధికారుల ఆదేశాల మేరకు స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించడానికి సముఖత వ్యక్తం చేశారు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆక్రమణలు తొలగించారు. ఇంకా మరో వీధిలో ఆక్రమణలు తొలగించాల్సి ఉంది. కార్యక్రమంలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి, ప్లానింగ్ కార్యదర్శి సునిల్ పాల్గొన్నారు.